క్లుప్తంగా

ఎరువుల దుకాణాల్లో తనిఖీ



కొమరిపాలెం ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న తహసీల్దార్ కృష్ణ

బిక్కవోలు: ఎరువుల దుకాణాల్లో, సొసైటీ గోదాములలో తహసీల్దార్ బీఎస్‌వీవీ కృష్ణ తనిఖీ నిర్వహించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ యూరియాకు డిమాండ్ ఎక్కువగా ఉందని ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు మండలంలోని ఎరువులు దుకాణాలు, సొసైటీలను తనిఖీ చేసినట్లు ఆయన తెలిపారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే రైతులు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలోని ఆర్ఐ రవికుమార్, వీఆర్వో శివకుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లకు మరమ్మతులు



చంద్రేడులో విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

రంగంపేట: మండల పరిధిలోని చంద్రేడులో మంగళవారం విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టినట్లు ఏఈ తోట శిరీష తెలిపారు. స్థానిక శివాలయం ఎదురుగా ఉన్న వీధిలో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని, వాటిని తొలగించి, కొత్త తీగలు ఏర్పాటు చేశామన్నారు. పాత విద్యుత్ స్తంభాలను తొలగించి, కొత్తవాటిని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో లైన్‌మేన్ సతీష్, విద్యుత్తు సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికవేత్త నాగేశ్వరరావు మృతి తీరనిలోటు

రంగంపేట: ఆధ్యాత్మికవేత్త, భజన గురువు పెండ్యాల నాగేశ్వరరావు అకాల మృతి భజన సమాజానికి తీరని లోటని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా విఘ్నేశ్వర భజన కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు యడవల్లి సూర్యచక్రం అన్నారు. స్థానిక దేవి బాలభక్త భజన సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సూర్యచక్రం తదితరులు నాగేశ్వరరావు మృతికి సంతాపం తెలిపి నివాళులర్పించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాగేశ్వరరావు 800 భజన సమాజాలు ఏర్పాటు చేశారన్నారు. అనేక దేవాలయాల వద్ద భజన కార్యక్రమాలు నిర్వహించి భక్తుల మన్ననలు పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దేవి బాలభక్తి భజన సమాజం అధ్యక్షుడు, మాజీ ఉప సర్పంచ్ పోతుల వీర సుందరరావు (వీరన్న), భజన సమాజం సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ భూమి కౌలు వేలం

పెదపూడి: గ్రామంలోని శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయం భూమికి కౌలు వేలం పాట మంగళవారం పూర్తయిందని ఈఓ వద్దాది సత్యనారాయణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ ఆలయానికి సంబంధించి 6.14 ఎకరాల సాగు భూమి ఉందన్నారు. ఈ భూమిని చేపల చెరువుగా మార్చుకుని ఐదేళ్ల పాటు సాగు చేసుకోడానికి పెదపూడిలోని ఆలయం వద్ద వేలం నిర్వహించగా ఏడాదికి రూ.1.80 లక్షలు చెల్లించేలా ఓ వ్యక్తి పాట దక్కించుకున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయ ధర్మదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఫణీంద్ర, కాకినాడ నూకలమ్మ ఆలయ ఈఓ మోర్త మురళీవీరభద్రరావు తదితరుల పర్యవేక్షించారు.

ఉత్సవ కమిటీలు జాగ్రత్తలు తీసుకోవాలి

రంగంపేట: వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే మండపాల వద్ద ఆయా ఉత్సవ కమిటీలు ప్రమాదాల నివారణకు అవసరమైన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మండల విద్యుత్తు శాఖ ఏఈ తోట శిరీష సూచించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా పందిరిలో విద్యుత్తు తీగలు, పరికరాల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. గణేశ్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా నిర్వహించే ఊరేగింపు సమయంలో విద్యుత్ లైన్లకు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఉత్సవ కమిటీలకు అనుమతి పత్రాలు అందజేత

బిక్కవోలు: మండలంలోని వినాయక చవితి పురస్కరించుకుని మండపాల ఏర్పాటుకు అనుమతి పత్రాలను ఆయా కమిటీలకు అందజేసినట్లు ఎంపీడీవో నాగేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలోని మండలంలోని 60 మందికి అనుమతి ధ్రువపత్రం అందజేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే అనుమతి వస్తుందని ఆయన తెలిపారు.

ఊరూవాడా గణేశ్ ఉత్సవ సందడి

- మండపాల వద్ద సర్వం సిద్ధం
- పూలు, పండ్లకు గిరాకీ
- కిటకిటలాడిన మార్కెట్లు
- చుక్కలనంటిన పూజాద్రవ్యాల ధరలు
- శోభాయమానంగా గణపతి మండపాలు



రాజానగరంలో చవితి పూజా సామగ్రి దుకాణాల వద్ద రద్దీ



పందలపాకలో మండపం వద్దకు చేరుకున్న గణనాథుడి విగ్రహం



బిక్కవోలులో వినాయక ప్రతిమలు, ఫ్యాన్సీ దండల దుకాణం వద్ద కొనుగోలుదారులు



అనపర్తిలో మండపానికి చేరుకున్న గణేషుడు

బిక్కవోలు: ఊరూవాడా వినాయక చవితి పూజలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. భాద్రపద మాసం శుద్ధ చతుర్థి సందర్భంగా వినాయక చవితిని పురస్కరించుకుని విఘ్ననాయకుడు గణపతి పూజలు చేస్తే తమ కోరికలు సిద్ధిస్తాయని పురాణేతిహాసాలు పేర్కొంటున్నాయి. హైందవ సంప్రదాయంలో ఇళ్లలో ఏ శుభకార్యం తలపెట్టినా గణపతి పూజతోనే ప్రారంభిస్తారు. అలాంటి బొజ్జ గణపయ్యను ప్రసన్నం చేసుకోవడానికి వాడ వాడలా యువకులు యువజన సంఘాలు, స్థానిక ఆలయ కమిటీలు ప్రత్యేకంగా మండపాలు ఏర్పాటు చేసి వివిధ రూపాల్లో వినాయక ప్రతిమలను భారీ ఎత్తున ఏర్పాటు చేసి ఉత్సాహభరితంగా ఉత్సవాలు నిర్వహిస్తారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలను స్వయంగా ఇళ్లలోనే తయారు చేసుకుని పూజలు చేసుకోవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వినాయక చవితి పండుగలో ప్రత్యేకత సంతరించుకున్న పాలవెల్లిని పండ్లు, పత్రి, పూలమాలలతో అలంకరించి ఏకదంతుడికి కుడుములు, ఆరిది తదితర పిండి వంటలతో నైవేద్యం సమర్పించి పూజలు చేస్తారు.

వినాయక చవితి సందర్భంగా బుధవారం నిర్వహించే పూజకు పండ్లు, పత్రి, ఇతర సామగ్రి కొనుగోలుకు జనం తరలిరావడంతో మంగళవారం ఉదయం నుంచి మార్కెట్లు కిక్కిరిసిపోయాయి. వ్యాపారులు ఇదే అదనుగా ధరలు విపరీతంగా పెంచేయడంతో పేద, మధ్య తరగతి కుటుంబాలు పూజాద్రవ్యాలను కొనుగోలు చేయడానికి బెంబేలెత్తుతున్నారు. పాలవెల్లి అలంకరణకు వాడే యాపిల్, బత్తాయి, ద్రాక్ష, దానిమ్మ పండ్లు, వెలగ, జామ, మారేడు, మామిడి,నారింజ కాయలు, మొక్కజొన్నతో పాటు ముఖ్యంగా వాడే చామంతి, తామర, కలువ పూలు ధరలు ఆకాశాన్నంటాయి. సాధారణ రోజుల్లో వినాయక చవితిని పురస్కరించుకుని వ్యాపారులు ప్రస్తుతం విపరీతంగా ధరలు పెంచి అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ ధరలతో సామాన్యులు రాజీపడక తప్పడం లేదు. నియోజకవర్గంలోని బిక్కవోలు, అనపర్తి, రంగంపేట, పెదపూడి మండలాల్లోని గొల్లలమామిడాడ, బిక్కవోలు, అనపర్తి, కొమరిపాలెం, పెదపూడి, వడిశలేరు తదితర గ్రామాల్లో మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. సాధారణ రోజుల్లో తక్కువ ధరకు లభించే మారేడుకాయ ప్రస్తుతం ఒకటి రూ.10, వెలక్కాయ రూ.20, కలువ, తామర పూలు ఒక్కొక్కటి రూ.20, పత్రుల కట్ట రూ.30 ధర పలుకుతోంది.

మార్కెట్‌లో 'చవితి' సందడి

రాజానగరం: వినాయక చవితి ప్రభావంతో మంగళవారం స్థానిక మార్కెట్‌లో ఏ వస్తువును కొనాలన్నా ఆకాశాన్నంటే ధరలు పలుకుతున్నాయని కొనుగోలుదారులు వాపోతున్నారు. మామిడి ఆకులతో కూడిన రెండు కొమ్మలు, ఉసిరి, రావి, ఇలా ఒకటో రెండో రకాల పత్రులకు సంబంధించిన కొమ్మలను కట్టలుగా కట్టి, మార్కెట్‌లో రూ.30 పైబడి విక్రయిస్తున్నారు. ఇక పూజకు అవసరమైన పూల ధరలు ఆకాశాన్నంటాయి. హోల్‌సేల్ మార్కెట్‌గా ఉన్న దివాన్‌చెరువులోని ఫ్రూట్స్ మార్కెట్‌లో వ్యాపారులు పండ్ల ధరలు భారీగా పెంచి విక్రయిస్తున్నారు.

అనపర్తి మెయిన్ రోడ్డులో రద్దీ

మార్కెట్‌లో పూజా ద్రవ్యాల ధరలు ఇలా..

సాధారణ రోజుల్లో	ప్రస్తుతం
ద్రాక్ష కిలో రూ.100	రూ.200
యాపిల్ (1) రూ.20	రూ.60
బత్తాయి (1) రూ.10	రూ.30
దానిమ్మ (1) రూ.15	రూ.40
జామ (1) రూ.3	రూ.10
నారింజ (1) రూ.3	రూ.10
సీతాఫలం (1) రూ.5	రూ.20
చామంతి (డజను) రూ.5	రూ.20
పత్రులు (ఒక కట్ట) రూ.5	రూ.30

అనపర్తి : గణపతి ఉత్సవాలకు అంతా సిద్ధమైంది. మండలవ్యాప్తంగా వినాయక చవితి నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఆయా ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గ కేంద్రమైన అనపర్తి మెయిన్‌రోడ్డు సందడిగా మారింది. పూజాద్రవ్యాల కొనుగోలుదారులతో రద్దీగా ఉంది. చిరు జల్లులు పడుతున్న ప్రజలు తమ పూజకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేసేందుకు తరలివచ్చారు. అనపర్తిలో టాక్సీ స్టాండ్ వద్ద టాక్సీ యూనియన్ ఆధ్వర్యంలో గణపతి నవ రాత్రి మహోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కుమ్మరి వీధి, కెనాల్ రోడ్డు గణపతి ఆలయంలో, మార్కండేయపురం, సంపత్ వినాయకుని ఆలయం, బాపనమ్మ ఆలయం వద్ద మండలంలో పొలమూరు, రామవరం, కుతుకులూరు, పెదపర్తి, పులగుర్త, కొప్పవరం, పీరారామచంద్రపురం, దుప్పలపూడి, ఎల్ఎస్‌పురం తదితర గ్రామాల్లో వినాయక చవితి మండపాలను భారీగా ఏర్పాటు చేశారు. పలుచోట్ల ఇప్పటికే భారీ గణేషుని విగ్రహాలను మండపాలకు తరలించారు.

చవితి వేడుకలకు సిద్ధమైన బిక్కవోలు గణపతి



బిక్కవోలులో శ్రీలక్ష్మీగణపతిస్వామి



బిక్కవోలులో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన క్యూలు

బిక్కవోలు: రాష్ట్ర వ్యాప్త ఖ్యాతి గాంచిన బిక్కవోలు శ్రీలక్ష్మీగణపతిస్వామి నవరాత్రి ఉత్సవ వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 6వ తేదీ వరకు నిర్వహించనున్న వినాయక ఉత్సవాలు మంగళవారం అర్ధరాత్రి దాటాక 1:58 గంటలకు స్వామి వారి తీర్థపు బిందె సేవతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. బుధవారం మధ్యాహ్నం 11:04 గంటలకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మీ, దంపతులతో కలశ స్థాపన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉత్సవ కమిటీ పర్యవేక్షణలో గ్రామస్తుల సహకారంతో ఉత్సవ ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు వేసి క్లాత్ డెకరేషన్, విద్యుత్ దీప కాంతులతో అందంగా అలంకరించారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే భక్తులు స్వామి వారిని తనివితీరా దర్శించుకోవడానికి ఇబ్బంది లేకుండా క్యూలైన్లను ఏర్పాటు చేశారు. రాత్రి బాణసంచా కాల్పులు ఏర్పాటు చేశారు. తొమ్మిది రోజుల పాటు భజన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఎమ్మెల్యే అక్రమాలను ప్రశ్నించినందుకే వ్యక్తిగత విమర్శలు

అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి : స్త్రీ శక్తి కార్యక్రమం పేరుతో నియోజకవర్గ వ్యాప్తంగా కూటమి నేతలు మహిళలను ఆటోలపై అనపర్తి తరలించి వారిని ఇబ్బందులకు గురిచేశారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న తప్పులను, అవినీతి, అక్రమాలను ఎప్పటికప్పుడు ఎత్తిచూపడంతో వాటికి సమాధానం చెప్పలేకే ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సోమవారం అనపర్తిలో బహిరంగ సభ ఏర్పాటు చేసి వ్యక్తిగత విమర్శలు చేస్తూ అర్థం పర్థం లేని ఆరోపణలు, నిందలు వేశారని ఆయన ఆరోపించారు. మహిళలకు ప్రభుత్వం ఏమి చేయబోతుందో వివరించి చెప్పవలసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి చేసిన ఆరోపణలు, ఆర్తనాదాలను విన్న మహిళలు విస్తుపోయారన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో అనేక సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన మహిళా సోదరీ మణులంతా కూటమి ప్రజా ప్రతినిధి తీరుపై అసహనానికి గురై ఒక్కొక్కరుగా అక్కడి నుంచి జారుకున్నారని, వారిని ఆపడానికి అధికార యంత్రాంగం వీధులన్నీ బ్లాక్ చేసినా ఫలితం లేకపోయిందని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి అన్నారు.

ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం

సమావేశానికి వచ్చే మహిళలు ప్రయాణిస్తున్న ఆర్టీసీకి చెందిన బస్సును ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తనయుడు మనోజ్‌రెడ్డి డ్రైవింగ్ చేయడంపై డాక్టర్ సూర్యనారాయణరెడ్డి తీవ్రంగా అభ్యంతరం చెప్పారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత తీసుకుంటారని ఆయన ప్రశ్నించారు. బీజేపీకి చెందిన ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి వినాయక చవితి ఉత్సవాలను కూడా ఖాతరు చేయకుండా వ్యాపారులను, భక్తులను ఇబ్బంది కలిగిస్తూ అనపర్తి ప్రధాన రహదారిని ఒక పూటంతా మూసివేశారని మండిపడ్డారు. సభా వేదికను ప్రైవేటు ఈవెంటుగా మార్చి వ్యక్తుల పెళ్లిరోజులు, పుట్టిన రోజు వేడుకలు నిర్వహించడం సిగ్గుచేటన్నారు. దీనికి అధికారులు వత్తాసు పలకడం శోచనీయని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి అన్నారు.

ఆనందోత్సాలతో వినాయక చవితి జరుపుకోవాలి

అనపర్తి : ప్రజలందరూ ఆనందోత్సాలతో వినాయక చవితి పండుగ జరుపుకోవాలనీ అనపర్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గ ప్రజలకు, కార్యకర్తలకు, అభిమానులకు వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు.

పర్యావరణాన్ని రక్షిద్దాం



చినకొండేపూడి ఆర్‌కే టెక్నో స్కూల్లో మట్టి ప్రతిమలు తయారు చేసిన విద్యార్థులు



సీతానగరం డిగ్రీ కళాశాలలో మట్టి ప్రతిమలను తయారు చేస్తున్న విద్యార్థులు

సీతానగరం: చినకొండేపూడి ఆర్‌కే టెక్నో స్కూల్ విద్యార్థులు పర్యావరణాన్ని రక్షిద్దామంటూ మంగళవారం ర్యాలీ నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ కె ప్రసన్నా రెడ్డి మాట్లాడుతూ ఎకో గణపతి.. పచ్చదనం, పర్యావరణ పరిరక్షణ అనే నినాదంతో విద్యార్థులు స్వయంగా మట్టితో ప్రతిమలు తయారు చేశారన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనాలతో తయారుచేసిన గణపతి విగ్రహాల వలన నదులు, చెరువుల్లోని నీరు కలుషితమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.వెంకటేశ్వరరావు, హెచ్‌ఎమ్ టి.రామకృష్ణ, వి.రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

పర్యావరణ హితం.. చిన్నారుల అభిమతం

సీతానగరం: వినాయక చవితికి మట్టితో తయారు చేసిన గణనాథుడి ప్రతిమలను పూజించడం ద్వారా పర్యావరణను కాపాడుకుందామని విద్యార్థులు అన్నారు. బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు మట్టి వినాయకుని పూజిద్దాం, పర్యావరణాన్ని రక్షిద్దామంటూ అవగాహన ర్యాలీని హెచ్‌ఎమ్ కోలా సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు మట్టి విగ్రహాలను తయారు చేసి వాటిని పాఠశాల ఆవరణలో ప్రదర్శించడంతోపాటు ఉపాధ్యాయులతో కలసి ప్రజలకు ప్రతిమలను పంపిణీ చేశారు. రఘుదేవపురం పీఎమ్‌శ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులు మంగళవారం మట్టి వినాయకుని ప్రతిమలు తయారు చేసి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతిమలను స్థానికులకు ఉచితంగా పంపిణీ చేశారు. హెచ్‌ఎమ్ శ్యామలాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు మట్టి ప్రతిమలను తయారు చేసి, ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు, అధ్యాపకులకు అందించారు. దత్తత గ్రామమైన నాగరత్నం కాలనీలో ర్యాలీ నిర్వహించి, మట్టి ప్రతిమలను స్థానికులకు అందించారు. వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ సుధామయి తదితరులు పాల్గొన్నారు

మట్టి వినాయకుని పూజిద్దాం

రాజానగరం: స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీతోపాటు మండలంలోని పాతవెలుగుబందలోని ఉన్నత పాఠశాల, దివ్య విద్యా సంస్థల విద్యార్థులు మంగళవారం మట్టితో వినాయకుని ప్రతిమలను తయారు చేసి పలువురికి పంచారు. పర్యావరణ హితమైన మట్టి ప్రతిమలను పూజించాలని వారు కోరారు.

మట్టి ప్రతిమల పంపిణీ

రంగంపేట: పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా విద్యార్థులు గణపతి మట్టి ప్రతిమలు తయారుచేసి తోటి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పంపిణీ చేసారు. సింగంపల్లి, రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, వర్క్ ఎడ్యుకేషన్ పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు ప్రసన్న, లక్ష్మీ ప్రోత్సాహంతో వినాయక ప్రతిమలు తయారు చేసారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు ఎన్.జె.భాస్కరరెడ్డి, వి.పార్థసారథి తదితరులు అభినందించారు.

వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం



రాజానగరంలో పాత ఎన్‌హెచ్‌పై బస్టాండ్ వద్ద నిలిచిపోయిన వాహనాలు

రాజానగరం: నియోజకవర్గ కేంద్రం రాజానగరంలో పాత ఎన్‌హెచ్‌పై మంగళవారం సాయంత్రం వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వినాయక చవితి సందర్భంగా స్థానిక గాంధీ బొమ్మ సెంటరు నుంచి బస్టాండ్ సెంటర్ వరకు రోడ్డుకు ఇరువైపులా పూజా సామగ్రికి సంబంధించిన స్టాల్స్‌ను విరివిగా ఏర్పాటు చేయడంతో కొనుగోలుదారులతో రద్దీ ఏర్పడింది. సమీపంలో పోలీసు స్టేషను ఉన్నా కనీసం ఇటువంటి సమయంలో కూడా ట్రాఫిక్‌ని నియంత్రించేందుకు ఒక్క కానిస్టేబుల్ లేకపోవడాన్ని ప్రయాణికులు విమర్శిస్తున్నారు.

జోరుగా లడ్డూల విక్రయం



ప్రత్యేకంగా తయారు చేసిన 90 కిలోల లడ్డూ

రాజమహేంద్రవరం రూరల్: గణనాథుని విగ్రహాల చేతిలో పెట్టేందుకు అవసరమైన లడ్డూల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఈ మేరకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు స్వీటు షాపుల్లో ఆర్డరు ఇచ్చి వీటిని తయారు చేయించుకుంటున్నారు. ఒక కేజీ నుంచి వంద కేజీల వరకూ లడ్డూలను తయారు చేయించుకుంటున్నారు. ఇలా తయారు చేసిన లడ్డూలను ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో సెజ్ ఉద్యోగి మృతి



మృతుడు వీరబాబు (ఫైల్)

పరవాడ: ట్యాంకర్ లారీ వెనుక చక్రాల కింద పడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడని పోలీసులు తెలిపారు. అనకాపల్లి జిల్లా పరవాడ తహసీల్దార్ కార్యాలయ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం కూనవరానికి చెందిన సుంకర వీరబాబు(38)గా గుర్తించారు. ఈయన అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లోని మెట్రో కెమ్ పరిశ్రమ ప్రొడక్షన్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అచ్యుతాపురం నుంచి వీరబాబు తన ద్విచక్ర వాహనంపై లంకెలపాలెం వైపు వెళ్తున్న క్రమంలో ముందు ఉన్న ట్యాంకర్‌ను తప్పించే క్రమంలో అదుపుతప్పి ఆ వాహనం కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో మృతుడి ఎడమ కాలు మీదుగా లారీ వెనుక చక్రాలు వెళ్లాయి. ప్రమాదంలో తీవ్ర రక్తస్రావం అయింది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం గాజువాకలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు పరవాడ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

పర్యావరణానికి వరం ప్రకృతి వ్యవసాయం

అనపర్తి : రైతులు రసాయనాలపై ఆధారపడకుండా, పర్యావరణానికి మేలు చేసే ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్ కుమార్ పిలుపు నిచ్చారు. మంగళవారం అనపర్తి మండలం ఏ.సావరంలో ఆయన వ్యవసాయ అధికారులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రకృతి పద్ధతుల్లో సాగు చేస్తున్న పొలాలను పరిశీలించి, రైతులతో ముచ్చటించారు. మరింత మంది రైతులను ఈ పద్ధతికి ప్రోత్సహించాలని ఆయన సూచించారు. ప్రకృతి పద్ధతుల్లో సాగు వల్ల రైతుల ఉత్పత్తి ఖర్చులను తగ్గుతాయని, ఆదాయం పెరుగుతుందని, వినియోగదారులకు సురక్షితమైన రసాయన రహిత ఆహారం అందించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, ప్రాజెక్ట్ మేనేజర్ తాతారావు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ కృష్ణ, డెల్టా జిల్లాల ప్రాజెక్టు మేనేజర్లు, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

మదర్ థెరిసా సేవలు ఆదర్శనీయం



సీతానగరంలో రక్తదానం చేస్తున్న డాక్టర్ బాబును అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: పేదలకు, అనాథలకు మదర్ థెరిసా చేసిన సామాజిక సేవలు ఆదర్శనీయమని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మదర్ థెరిసా జయంతి సందర్భంగా మంగళవారం సీతానగరంలో సేవా సమితి, డాక్టర్ బాబు ఫ్రెండ్స్ సర్కిల్ 27వ వార్షికోత్సవాన్ని వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు, మదర్ థెరిసా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పెదపాటి రమేష్‌బాబు (డాక్టర్ బాబు) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జక్కంపూడి రాజా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మదర్ థెరిసాతోపాటు జాతీయ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ గొప్ప మానవతామూర్తి మదర్ థెరిసా సేవలను స్ఫూర్తిగా తీసుకుని డాక్టర్‌బాబు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీమన్నారు. డాక్టర్‌బాబు 129 సార్లు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. డాక్టర్ బాబు మాట్లాడుతూ సేవా సమితి ద్వారా ఇప్పటి వరకు 29,000 యూనిట్ల రక్తదానం చేశామన్నారు. వంగలపూడికి చెందిన ప్రత్యేక అవసరాలు గల చిక్కాల శివ రామకృష్ణకు వీల్‌చైర్‌తోపాటుగా ఆర్థిక సహాయం, మట్టా నరసింహమూర్తి, పెంటా సూరమ్మకు ఆర్థిక సహాయాన్ని మాజీ ఎమ్మెల్యే రాజా చేతుల మీదుగా అందించారు. లంకూరు ఎంపీపీ స్కూల్‌కు పది కుర్చీలు, సీతానగరం ఎంపీపీ స్కూల్‌కు ఫ్యాన్లు అందించారు. ఈ సందర్భంగా 53 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జోత్స్న, వైస్ ఎంపీపీలు ముదునూరి సురేష్‌రాజు, సత్యం మదన్‌బాబు, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వలవల వెంకట్రాజు, మాజీ ఎంపీపీ పెందుర్తి దేవదాసు, మండల సర్పంచ్ సమాఖ్య సంఘం అధ్యక్షుడు కొండ్రపు ముత్యాలు, మట్టా వసంతరావు, ఉప సర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, ఎంపీటీసీలు వెన్నెల అప్పలనాయుడు, తాడేపల్లి వెంకట్రావు, చల్లమళ్ల సుజీరాజు, అంబటి రాజు, కొంచ భాస్కరరావు, వలవల సత్తిబాబు, శ్రీను, పలువురు యువకులు పాల్గొన్నారు.

'నన్నయ'లో మదర్‌థెరిసా జయంతి

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో మదర్ థెరిసా జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఆమె చిత్రపటానికి రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి పూలమాల వేసి నివాళులర్పించారు. నోబెల్ బహుమతి అందుకున్న మదర్ థెరిసా సేవా గుణాలను అందరూ అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

మదర్ థెరిసా సేవలు స్ఫూర్తిదాయకం

బిక్కవోలు: మదర్ థెరిసా సేవలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని మోఖ్లారు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జి.లక్ష్మీ అన్నారు. మంగళవారం మదర్ థెరిసా జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు పాల్గొన్నారు.